ప్రజాశక్తి
ఆదివారం 28 ఏప్రిల్ 2024
I
అల్లూరి సీతారామరాజు

ఈదురుగాలులతో భారీ వర్షం

- అవస్థలు పడ్డ వాహనదారులు

ప్రజాశక్తి -హుకుంపేట:-శనివారం భయంకరమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షానికి శనివారం వారపు సంతకు వచ్చిన వారంతా పెట్రోల్ బంక్ వద్ద తలదాచుకున్నారు. రెండు గంటలసేపు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది.

పెట్రోల్ బంక్ వద్ద వేచివున్న వాహనదారులు

ఇండియా బ్లాక్‌తోనే అభివృద్ధి సాధ్యం

-ప్రజాగళం వినిపించేవారినే చట్టసభలకు పంపండి
-ఆదివాసీలకు ద్రోహం చేసిన బిజెపి, పొత్తు, తొత్తు పార్టీలను ఓడించండి
-పిసిసి అధ్యక్షురాలు షర్మిల, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపు
-పాడేరు, అరకులోయ, పాయకరావుపేటల్లో సభలు
-పెద్ద సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ శ్రేణులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పాడేరు, అరకులోయ విలేకరులు

ఇండియా బ్లాక్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, ప్రజలకు న్యాయం జరుగుతుందని పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా షర్మిల తలపెట్టిన ఎపి న్యాయ్ యాత్రలో భాగంగా అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట, అల్లూరి జిల్లాలోని పాడేరు, అరకులోయల్లో శనివారం బహిరంగ సభలు నిర్వహించారు. ఆయా సభల్లో షర్మిల మాట్లాడుతూ టిడిపి, వైసిపిల హయాంలో రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. కాంగ్రెస్, వామపక్షాలతోనే ప్రజా సంక్షేమం, ఆదివాసీల అభివృద్ధి సాధ్యమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తున్న బిజెపికి జగన్, చంద్రబాబు తొత్తులుగా మారారని విమర్శించారు. బిజెపి మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకొస్తానని చెప్పిన జగన్ హోదా కోసం ఒక్క నిజమైన ఉద్యమమైనా చేశారా అని నిలదీశారు. రాష్ట్రానికి ఊపిరి లాంటి ప్రత్యేక హోదా, రాజధాని, పోలవరం ప్రాజెక్టు పూర్తి ఇండియా బ్లాక్‌తోనే సాధ్యమన్నారు. బిజెపితో కొట్లాడే ధైర్యం టిడిపి, వైసిపిలకు లేవన్నారు. ప్రత్యేక హోదా వచ్చివుంటే ప్రతి నియోజకవర్గంలో యాభై నుంచి వంద కొత్త పరిశ్రమలు రావడం ద్వారా యువతకు ఉపాధి లభించేదన్నారు. నష్టపోతున్న చెరకు రైతులు, కార్మికులను పట్టించుకోని వారికి ఓటు వేయొద్దన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదివాసీలకు ఈ ఎన్నికలు ఎంతో కీలకమన్నారు. అటవీ భూములను కాజేసేందుకు కుట్రలు పన్నుతున్నవారిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ ప్రాంతంలోని ఖనిజ సంపదనంతటినీ అదానీపరం చేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని తెలిపారు. రాజ్యాంగం లేకపోతే గిరిజన ప్రాంతంలో రక్షణ ఉండదని, 1/70 చట్టం, పీసా చట్టం కనుమరుగవుతాయని తెలిపారు. మనువాదం కావాలా ? అంబేద్కర్ రాజ్యాంగం కావాలా ? అన్న విషయాన్ని ఆదివాసీలు ఆలోచించాలన్నారు. ఇండియా బ్లాక్‌కు ఓటేసి గెలిపిస్తే గిరిజనులకు రక్షణ ఉంటుందన్నారు. అవినీతి అభియోగాలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను ఆదివాసీలు ఓడించాలన్నారు. అరకు సిపిఎం ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామంటూ బిజెపి చెబుతోందని, రాజ్యాంగం మోడీ తాత ముత్తాతలు చేసింది కాదని అన్నారు. బిజెపి అరాచకాలపై ఇండియా బ్లాక్ తిరుగుబాటు చేస్తోందన్నారు. తనను అరకు ఎంపీగా గెలిపిస్తే ప్రజా సమస్యలపై చట్టసభల్లో పోరాడుతానని అన్నారు. అరుకు ప్రాంతాన్ని టూరిజం హబ్, ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం హామీలు ఇచ్చి విస్మరించిందన్నారు. పాడేరులో బిఇడి కళాశాల కార్యరూపం దాల్చలేదని, అరకులో డైట్ కళాశాల ఊసే లేదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి నకిలీ గిరిజనురాలైన కొత్తపల్లి గీతకు టికెట్ ఇచ్చి ఎంపీగా నాడు గెలిపించారని, ఇప్పుడు మళ్లీ అదే జగన్మోహన్ రెడ్డి ఆమె గిరిజనురాలు కాదని చెబుతున్నారని, వారి స్వార్థపూరిత విధానాలను అర్థం చేసుకోవాలని అన్నారు. నకిలీ గిరిజనులను ప్రోత్సహించడం దుర్మార్గమన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ కోసం పోరాడుతున్న తనపై జగన్ సర్కారు తీవ్ర నిర్బంధం విధించిందన్నారు. జీవో నెంబర్ 3పై ఏ ఎంపీ, ఎమ్మెల్యేలూ చేయని విధంగా తాను సుప్రీంకోర్టులో కేసు వేశానన్నారు. కొత్తపల్లి గీతపై రిటర్నింగ్ ఆఫీసర్‌కి ఫిర్యాదు చేసినా స్టే ఉందని చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ఎన్నికలు నకిలీ గిరిజనులకు, నిజమైన గిరిజనులకు మధ్య జరుగుతున్నాయని అన్నారు.

పాడేరు కాంగ్రెస్ అభ్యర్థి శతక బుల్లిబాబు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఇండియా బ్లాక్ బలపరిచిన తనను గెలిపించాలని కోరారు. గిరిజన హక్కులకు రక్షణ తమతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ అరకు ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టి గంగాధర్ స్వామి మాట్లాడుతూ ఆదివాసీల భవిష్యత్తు కోసం తమను గెలిపించాలని కోరారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో పాయకరావుపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బోని తాతారావు, కాంగ్రెస్ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు, సిపిఐ అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, అమర్, అనకాపల్లి జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుబ్రహ్మణ్యం, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. అరకులోయ, పాడేరుల్లో జరిగిన సభలకు పెద్ద సంఖ్యలో గిరిజనులు తరలివచ్చారు. నేతల ప్రసంగాలు వారిని ఆలోచింపజేశాయి. గిరిజన కళాకారుల థింసా నృత్యం, ఇతర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, చిత్రంలో షర్మిల, అప్పలనర్స, గంగాధరస్వామి

షర్మిల రోడ్ షో

హుకుంపేట: మండల కేంద్రంలోని మోద కొండమ్మ గుడి వద్ద కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల రోడ్ షో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టి గంగాధర్‌స్వామి, వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, సిపిఎం, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

షర్మిల సభకు తరలి వెళ్లిన సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అరకు వారపు సంతలో షర్మిలకు స్వాగతం పలికి అరకులోయలో నిర్వహిస్తున్న సభకు సిపిఎం శ్రేణులు తరలి వెళ్లారు. దీనికి ముందు అరకు వారపు సంతలోని నారింజ వలస గ్రామంలో ఆ పార్టీ నాయకులు గడపగడపకు కర పత్రాలను పంచుతూ సిపిఎం ఎంపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆర్.రాము, మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు, పి.సురేష్ కుమార్ సత్యనారాయణ, టి.సూర్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

థింసా నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-రంపచోడవరం

త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు, వివి ప్యాడ్లపై ఎన్నికలు విధులు నిర్వహించే సెక్టార్, రూట్ అధికారులకు శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో కమిషనింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఈవీఎంలు, వివి ప్యాడ్లపైనా, వీటిపై ఉండే 60 రకాల చెక్ లిస్టులపైనా పూర్తిగా అవగాహన చేసుకోవాలని సూచించారు. అనంతరం ఈవీఎంలు, వివి ప్యాడ్లు ఏ విధంగా ఉపయోగించాలో తెలియజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్లు నజీముల్లా, సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్లు రామకృష్ణ, సుబ్బారావు, సెక్టర్ అధికారులు, రూట్ అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎపి జెన్‌కో ఎస్ఇ ప్రశాంత్‌కుమార్

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు మారెమ్మ తల్లి 52వ వార్షిక మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఏపీ జెన్కో ఎస్ఇ సివిల్ కేకేవి ప్రశాంత్ కుమార్, ఈఈ లక్ష్మీనారాయణ, స్థానిక ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, సర్పంచి దుర్గ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో పోటీలో తలపడి నైపుణ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ పోటీలను ఏర్పాటు చేసిన యువ క్రికెట్ అసోసియేషన్ నాయకులు విష్ణుకుమార్ శ్యామ్ సన్ మాట్లాడుతూ ప్రతి ఏడాది మారెమ్మ అమ్మవారి ఉత్సవాల పురస్కరించుకుని సమ్మర్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తుంటామని చెప్పారు. ఈ పోటీలు ఈనెల 27 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి, ఒడిశా ప్రాంతం నుండి సుమారు 24 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. అనంతరం ఫ్రెండ్లీ మ్యాచ్‌గా ఏ బీ టీములు పాల్గొని క్రీడ నైపుణ్యాన్ని ప్రదర్శించాయి. సాయంత్రం బచ్చులూరు - మోతుగూడెం జట్లు తలపడ్డాయి. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ సుభాష్, ఏపీ జెన్కో ఏఈ సివిల్ సురేష్, సీనియర్ క్రీడాకారుడు ఎస్.నాగేశ్వరరావు, బాలాజీ లాడ్జి ఓనర్ ఎన్.జ్ఞానేశ్వరరావు, యూత్ క్రికెట్ సభ్యులు పాల్గొన్నారు.

ట్యాంకు వద్ద వేచివు న్న గిరిజనులు

వాలసిలో దాహం దాహం

-మరమ్మతుకు నోచని మోటార్ బోరు

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని వాలసి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తింది. గత వారం రోజులుగా తాగునీటి సమస్య సరఫరా నిలిచి పోవడంతో ఆ గ్రామానికి చెందిన సుమారు 70 కుటుంబాలు దాహం కేకలతో అల్లడిపోతున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు గత ఏడాది బోరు నిర్మించి విద్యుత్ మోటార్ కనెక్షన్ ఏర్పాటు చేశారు. అప్పటి నుండి నీటి సరఫరా అవుతుంది. వారం రోజుల క్రితం బోరు మోటార్ కనెక్షన్ మరమ్మతుకు గురైంది.దీంతో, గ్రామంలో ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తక్షణమే స్పందించి మరమ్మతుకు గురైన మోటారును బాగు చేసి తాగునీటి సరఫరా చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షణం మండల కేంద్రంలో ఖాళీ బిందెలతో ఆందోళన చేపడతామని డిమాండ్ చేశారు.వాటర్ ట్యాంకు వద్ద ఉన్న కుళాయి నుంచి అతి కొద్దిగా వస్తున్నా అక్కడే మహిళలు వేచి ఉండి పట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

పోలీసుల సహకారంతో పరీక్షకు హాజరు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని 6 పాఠశాలల విద్యార్థులకు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ నిమిత్తం శనివారం నర్సీపట్నం పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు పంపిం చామని సిఐ రమేష్, ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. పది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతంలో ఇక్కడ ప్రవేశ పరీక్ష నిర్వహించి అందులో సెలెక్ట్ అయిన వారికి ఆన్లైన్ చేయించి పోలీసుల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులో వారిని ఇద్దరు పోలీసులు సహాయంతో తరలించారు. అనంతరం భోజన సదుపాయం ఏర్పాటు చేసి తిరిగి తీసుకు వచ్చామని తెలిపారు.

తవ్వేశారు.. వదిలేశారు...

★ రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న పెద్దమట్టపల్లి-నరసింగపేట రహదారి
★ తారురోడ్డు పునర్నిర్మాణానికి 2020 అక్టోబర్‌లో ఎమ్మెల్యే ధనలక్ష్మి శంకుస్థాపన
★ మూడున్నరేళ్లయినా పట్టించుకోని వైనం ★ ఇబ్బంది పడుతున్న 16 గ్రామాల ప్రజలు



2020 అక్టోబర్ 22న ఎమ్మెల్యే ధనలక్ష్మి శంకుస్థాపన చేసిన శిలాఫలకం, రోడ్డు తవ్వేయడంతో తేలిపోయిన రాళ్లు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని పెద్దమట్టపల్లి ఆర్ అండ్ బి రహదారి నుండి నరసింగపేట వరకు ఉన్న రహదారిలో రాకపోకలు సాగించే 16 గ్రాయాల ప్రజల పరిస్థితి పెన్నం మీద నుండి పొయ్యిలో పడినట్లయింది. గోతులు ఉన్న ఈ తారురోడ్డు పునర్నిర్మాణం నిమిత్తం తవ్వేసి, నిర్మాణ పనులు నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు తవ్వేసి మూడున్నరేళ్లయినా పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ధనలక్ష్మి సైతం దాని గురించి పట్టించుకోవడం లేదు. దీంతో 16 గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

మండలంలోని పెద్దమట్టపల్లి ఆర్ అండ్ బి రహదారి నుండి ములకనపల్లి, తెల్లవారిగూడెం, కారంగూడెం, కుందులూరు మీదుగా నరసింగపేట వరకు 16 కిలోమీటర్ల మేర గతంలో తారు రోడ్డు ఉండేది. ఈ రహదారి మొత్తం గోతులుగా ఉండడంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ తారురోడ్డు పునర్నిర్మాణానికి 2020లో 4.33 కోట్లు మంజూరు కాగా, 2020 అక్టోబర్ 22న స్థానిక ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శంకుస్థాపన చేశారు. అనంతరం రహదారి పునర్నిర్మాణం నిమిత్తం గుత్తేదారుడు పాత రోడ్డు మొత్తాన్ని తవ్వారు. కాని తరువాత రోడ్డు పునర్నిర్మాణం చేయకుండా పనులు నిలిపివేశారు. గతంలో రహదారికి గోతులు మాత్రమే ఉండేవి. రోడ్డును తవ్వేసి వదిలేయడంతో రోడ్డు మొత్తం రాళ్లు తేలిపోయి ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ మార్గంలో సుమారు 16 గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు, నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి, ఆసుపత్రికి, బ్యాంకు పనుల మీద మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటూ ఉంటారు. అయితే రోడ్డంతా రాళ్లు తేలిపోయి ఉండడంతో ప్రయాణానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. రోడ్డు తవ్వేసి మూడున్నరేళ్లయినా రహదారి పునర్నిర్మాణం చేయలేదు. దీనిపై అనేక సార్లు సిపిఎం ఆధ్వర్యాన స్థానికులు ఆందోళనలు చేపట్టారు. అయినా అధికారులుగాని, శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ధనలక్ష్మిగాని పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెట్టారు.

మళ్లీ ఎన్నికలు వచ్చిన నేపథ్యంలో ఓట్లు అడగటానికి నేతలు తమ ఊర్లకు ఏ మొఖం పెట్టుకొని వస్తున్నారని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. కోట్ల రూపాయలు నిధులు మంజూరైతే నిర్మాణం చేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని నిలదీస్తున్నారు. అడుగడుగునా గోతులతో అత్యవసర వైద్య సేవలు కూడా అందడం లేదని, రోడ్డు పునర్నిర్మాణంపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సమాధానం చెప్పాలని కోరుతున్నారు. ఇకనైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పెద్దమట్టపల్లి నుండి కుందులూరు, నరసింగపేట వరకు తవ్వి వదిలేసిన రోడ్డును పునర్నిర్మాణం చేయాలని 16 గ్రామాల ప్రజలు కోరుతున్నారు. లేకుండా వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తాం

ప్రజాశక్తి కథనానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి-చింతూరు

'చింతూరులో తాగునీటి కష్టాలు' శీర్షికన శనివారం ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి చింతూరు పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ చింతూరు గుబేలుపేటలోని కుళాయిలను, గొల్లబజార్, బీసీ కాలనీల్లో తాగునీటి సరఫరాను శనివారం పరిశీలించారు. పాడైపోయిన హ్యాండ్ బోర్లను త్వరలో మరమ్మతులు చేస్తామని చెప్పారు. ఈ విషయంపై ప్రజాశక్తితో సెక్రెటరీ ప్రసాద్ మాట్లాడుతూ వారం రోజులుగా మంచినీటి పైపులైన్ మరమ్మతులకు గురైందని, మోటార్లు సరిగా పని చేయకపోవడం వలన ఈ సమస్య ఏర్పడిందని తెలిపారు. వాటిని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తామని, మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కుళాయిలను పరిశీలిస్తున్న కార్యదర్శి

108 వాహనంలో ప్రసవం

ప్రజాశక్తి -మారేడుమిల్లి

మండలంలోని పుల్లంగి పంచాయతీ మారుమూల గ్రామం తేనెల మామిడిలో సాదల రాజకుమారి అనే గిరిజన మహిళ శనివారం తెల్లవారుజామున పురిటి నొప్పులతో బాధపడుతుండడంతో గ్రామస్తులు 108 వాహనానికి సమాచారం అందించారు. దీంతో మారడుమిల్లి 108 సిబ్బంది తేనెల మామిడి గ్రామానికి చేరుకుని రాజకుమారిని వాహనంలో మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో 108 సిబ్బంది ఎం వెంకటేశ్వరరావు, పైలట్ బి.నాగేశ్వరరావు చాకచక్యాంగా వ్యవహరించి పురుడు పోశారు. రాజకుమారి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డను బోదులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇదిలా ఉండగా ఈ ఒక్క రాత్రే మారేడుమిల్లి 108 సిబ్బంది ఇద్దరు గర్భిణులకు ఎలాంటి ప్రమాదం లేకుండా పురుడు పోశారు. ఇద్దరికీ మగ బిడ్డలు పుట్టినట్లు వారు తెలిపారు. 108 సిబ్బంది సేవలకు పలువురు ప్రశంసించారు.

తల్లికి బిడ్డను అందిస్తున్న 108 సిబ్బంది

నేడు మారెమ్మ అమ్మవారి ప్రధాన పండగ

ప్రజాశక్తి- సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో మారెమ్మ అమ్మవారి ప్రధాన పండగ ఆదివారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. మొక్కలు, తలనీలాలు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. మారెమ్మ అమ్మవారి పండగకు ఆంధ్ర, ఒరిస్సా చతీష్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాల నుండి, ఆంధ్రాలోని అల్లూరి, అనకాపల్లి, విశాఖ జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. వీరికి ఎండ వేడి నుంచి ఉపశమనం పొందడానికి మజ్జిగ, మంచినీరు దాతల సహాయం పంపిణీ చేస్తారు. ఆదివారం మధ్యాహ్నం భారీ ఎత్తున అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నారు.

గరగలు ఊరేగింపు

మారెమ్మ అమ్మవారి 52వ వార్షిక మహోత్సవాలు సందర్భంగా శనివారం సాయంత్రం గరగలు ఊరేగింపు కార్యక్రమాన్ని కమిటీ నిర్వాహకులు నిర్వహించారు. అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమై పురవీధుల్లో మందుగుండు సామాగ్రి కాల్చుతూ, నృత్యాలు చేస్తూ అమ్మవారిని ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జోరుగా సిపిఎం ఎన్నికల ప్రచారం

- ఏజెన్సీలో మౌలిక వసతుల కల్పనకు కృషి : లోతా రామారావు
- అన్ని వర్గాల సమస్యలపై పోరాడేది ఎర్రజెండా మాత్రమే : వి.వెంకటేశ్వర్లు

ఒట్టిగడ్డలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజవొమ్మంగి : ఇండియా వేదిక బలపర్చిన రంపచోడవరం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, అరకు ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సలను గెలిపించాలని చేపట్టిన ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని రాజవొమ్మంగి మండలం ఒట్టిగడ్డలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు శనివారం జెండా ఊపి ప్రారంభించారు. సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావుకు, సిపిఎం నాయకులకు ఒట్టిగడ్డ గ్రామ మహిళలు పూలమాలలు వేసి, నుదుటిక తిలకం దిద్ది ఘనంగా స్వాగతం పలికారు. ప్రచారంలో ప్రజానాట్య కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, ఆలపించిన గీతాలు ఆలోచింపజేశాయి. ఒట్టిగడ్డలో ప్రారంభమైన ప్రచారం తంటికొండ, నెల్లిమెట్ల, నెల్లిమెట్ల కాలనీ, లబ్బర్తి, లాగరాయి, కింద్రా, కిర్రాబు, కిర్రాబు కాలనీ, తాళ్లపాలెం, వట్టిగొంది, బోయపాడు, శరభవరం, దాకరాయి, కొండపల్లి, సోంపాలెం, భీమవరం మీదుగా రాజవొమ్మంగి చేరుకుంది. గ్రామాల్లో రామారావుకు సిపిఎం నాయకులకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అనంతరం రాజవొమ్మంగి వారపు సంత మార్కెట్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు మాట్లాడుతూ, టిడిపి, వైసిపి పాలనలో ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని, తను గెలిపిస్తే ఏజెన్సీ ప్రాంతంలో రహదారులు, తాగునీరు, సాగునీరు, వీధి రోడ్లు, విద్యుత్తు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. సిపిఎం నేత వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు, కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది ఒక్క సిపిఎం మాత్రమేనని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కొండ సూరిబాబు, కుంజం జగన్నాథం, పాండవుల సత్యనారాయణ, టి.శ్రీను మేలిన రమేష్, తెడ్ల అబ్బాయి, కాళ్ల రాజబాబు, పి.వీరబాబు, క్రాంతి, లక్ష్మి, రామరాజు పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

రంపచోడవరం : రంపచోడవరం మండలంలోని పలు లోతట్టు గ్రామాలలో సిపిఎం నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. మరోపక్క ప్రజానాట్యమండలి కళాకారులు గ్రామాల్లో పర్యటిస్తూ తమ నృత్యాలు, పాటలతో ప్రజలను ఆకట్టుకుని సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేస్తున్నారు. ఏళ్ల తరబడి రోడ్లు, తాగునీటి సమస్యలు పరిష్కారం కావడం లేదని, కొండపోడు భూముల పట్టాలు ఇవ్వడంలేదని స్థానికులు సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. సిపిఎం అభ్యర్థులను గెలిపించి ఈ సమస్యలపై చట్ట సభల్లోనూ పోరాడుతానని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు క్రాంతి, మట్ల వాణిశ్రీ, ప్రజా నాట్యమండలి సభ్యులు పాల్గొన్నారు.

వై.రామవరం : మండలంలోని యార్లగడ్డ పంచాయతీ పరిధి చీడిపాకలు, చేసరాయి గ్రామాల్లో సిపిఎం నాయకులు ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు ఇచ్చి, గ్రూప్ మీటింగ్‌లు పెట్టి సిపిఎం అభ్యర్థులను గెలిపించాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మల్లికార్జునరావు, ఎం.అంజనేయులు, వెంకన్న, నాగేంద్ర, గణేష్, శాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం : మండలంలోని సృష్టి వారి గూడెం, సోకిల్లి, వి.ఆర్ పురం బీసీ కాలనీ తదితర గ్రామాలలో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. సిపిఎం అభ్యర్థులను ఆశీర్వదిస్తే, పార్లమెంటుకు పంపిస్తే పోలవరం ప్యాకేజీపై పోరాడుతారని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పూనెం సత్యనారాయణ, సోయం చిన్నబాబు ఎంపిటీసీ పూనెం ప్రదీప్ కుమార్, మాజీ ఎంపిటీసీ సున్నం పార్వతి, అచ్యుతరావు, పండా వెంకటేశ్వర్లు, వడ్డది రమేష్, సోడి మల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎటపాక : మండలంలోని గోళ్ళగూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలను సిపిఎం నాయకులు కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వై మాట్లాడుతూ ఎన్నో ప్రజా ఉద్యమాల అనుభవం ఉన్న సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, ఎంపి అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రసన్న, ఇరపా సత్యం, ఆకెరెడ్డి రాము, బందారు స్టాలిన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో కేంద్రంలో శనివారం వారపు సంతలో వైసీపీ నేతలు ప్రచారం చేపట్టారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్య లింగం, ఎంపీ అభ్యర్థి తనూజారాణి గెలిపించాలని ఆ పార్టీ నేతలు కోరారు. మండల వైసీపీ అధ్యక్షులు పాంగి పద్మారావు ఆధ్వర్యంలో కించాయిపుట్టు, సింధిపుట్, సిర్గంపుట్, కడింగ్ బీరు, మర్రిపుట్, అడల్‌పుట్, కుమ్మిడిపుట్ గ్రామాలలో ఇంటింటికి వెళ్లి వైసిపి నేతలు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జర్జుల సర్పంచ్ పోర్తిమా, కె.సాధురం, పి.మాణేశ్వరరావు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం మండలంలో సిపిఎం నాయకుల ప్రచారం...

నేరాలు ఘోరాలు

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పొట్టిదొరపాలెం గ్రామంలో గురువారం రాత్రి వివాహితను హత్య చేసిన కేసులో ఆమె భర్తను పోలీసులు శనివారం అరెస్టు చేసి, కోర్టుకు తరలించినట్లు కొత్తకోట సిఐ ఎల్. అప్పలనాయుడు తెలిపారు. పొట్టి దొరపాలెం గ్రామానికి చెందిన అన్నపూర్ణ గురువారం రాత్రి మృతి చెందడంపై అనుమానాస్పద స్థితిలో మృతిగా పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసు విచారణ చేసిన పోలీసులు అన్నపూర్ణ భర్త రాముల సత్తిబాబు హత్యచేసినట్లు నిర్ధారించి ఆయన్ను అరెస్టు చేసి శనివారం కోర్టుకు తరలించారు. కోర్టు రిమాండ్ విధించడంతో సత్తిబాబును విశాఖ సెంట్రల్ జైలుకు తరలించినట్లు సిఐ తెలిపారు.

భర్తను హత్య చేసిన భార్య ప్రియుడు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొట్టివాడ పంచాయతీ శివారు సాలాపువానిపాలెం గ్రామంలో భర్తను భార్య ప్రియుడు హత్య చేసిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సాలాపు వానిపాలెం గ్రామానికి చెందిన సాలాపు శ్రీనివాసరావు దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాసరావుకు బదేళ్ల క్రితం గాజువాక మండలం మంగళపాలెం గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భాగ్యలక్ష్మి అదే గ్రామానికి చెందిన గల్లా రవికుమార్‌తో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో మూడేళ్లగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం శ్రీనివాసరావు భాగ్యలక్ష్మిని పెళ్లిరోజు సందర్భంగా ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఈ సంగతి భాగ్యలక్ష్మి తన ప్రియుడికి చెప్పింది. ఇది ఇలా ఉండగా, శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో శ్రీనివాసరావు పొలానికి నీరు పెట్టి తిరిగి వస్తుండగా, భాగ్యలక్ష్మి ప్రియుడు గల్లా రవికుమార్, గరికపాటి శ్రీహరి అలియాస్ హరీష్ అనే వ్యక్తిని వెంట పెట్టుకుని వెళ్లి శ్రీనివాసరావు తలపై మంచం కోడుతో బలంగా కొట్టారు. తలకు తీవ్ర గాయమై శ్రీనివాసరావు పెద్దగా కేకలు వేయడంతో, కుటుంబ సభ్యులు, తండ్రి అప్పారావు మరి కొంతమందితో కలిసి పొలంలోకి వెళ్లి చూడగా, శ్రీనివాసరావు రక్తపుమడుగులో పడి ఉన్నాడు. దీంతో శ్రీనివాసరావును స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు తండ్రి సాలాపు అప్పారావు ఫిర్యాదు మేరకు స్థానిక సిఐ పిన్నింటి రమణ కేసు నమోదు చేసి, నిందితులు గల్లా రవికుమార్, గరికపాటి శ్రీహరిని సబ్బవరం జోడుగుళ్ళ జంక్షన్ వద్ద పట్టుకుని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

వెంకట్రావు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -తగరపువలస : టిడిపిలో క్రియాశీలకంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన జివిఎంసి ఒకటో వార్డుకు చెందిన దళిత సంఘం నాయకులు కీర్తిశేషులు రవ్వ వెంకట్రావు అందించిన సేవలు మరువలేనివని పలువురు పార్టీ నాయకులు కొనియాడారు. స్థానిక ఒకటో వార్డు పార్టీ కార్యాలయంలో శనివారం రవ్వ వెంకట్రావు వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు టి.సూరిబాబు, పార్టీ నాయకులు వానపల్లి సత్య, డి.వెంకటేష్, మాజీ కౌన్సిలర్లు చిలకా నరసింగరావు, పిట్టా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : టిడిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, లోక్‌సభ అభ్యర్థి ఎం.శ్రీభరత్ విజయాన్ని కాంక్షిస్తూ జివిఎంసి మూడో వార్డులోని పలు ప్రాంతాల్లో శనివారం టిడిపి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి 2, 3 వార్డుల కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ, మాజీ కౌన్సిలర్లు గొలగాని నరసింహ, పి.లక్ష్మీకుమారి, పార్టీ నాయకులు గంటా నూకరాజు, ఎం.సంతోష్‌కుమార్, ఎస్.జోగారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో శనివారం టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు కుమారుడు రవితేజ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ఎన్నికల్లో గంటా శ్రీనివాసరావును ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కోరాడ రమణ, మాజీ అధ్యక్షులు కాల నగేష్‌కుమార్, టిడిపి నాయకులు ఎం.నందేశ్వరరావు, కె.దామోదర, కె.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ప్రజాశక్తి -మధురవాడ : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అడిషనల్ డిజిపి ఎ.రవిశంకర్ ఆదేశాలతో జాయింట్ సీపీ పకీరప్ప నగరంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శనివారం పరిశీలించారు. రుషికొండ, వాడపాలెంలోని జెడ్‌పి హైస్కూల్ తదితర కేంద్రాలను పరిశీలించి, మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. ముఖ్యంగా సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పని తీరును తనిఖీ చేశారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చేపట్టాల్సిన భద్రత చర్యల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. మే 13న ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా గట్టి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

శరవేగంగా రోడ్డు పనులు

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని ఎంకె.పట్నం నుండి బిబి.పట్నం, రత్నంపేట మీదుగా వడ్డిప వరకు రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గత ఆరేళ్లుగా ఈ రోడ్డు పనులు జరుగుతూ ఉన్నాయి. ఈ మూడు పంచాయతీ గ్రామాల ప్రజలు, నాయకులు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకుంటే ఈ గ్రామాల్లో తిరగలేమని వైసిపి నాయకులు చెప్పడంతో ఆదరాబాదరాగా పనులు చేపట్టారు. గొలుగొండ మండలం ఏటిగైరంపేట నుంచి ఎంకె.పట్నం వరకు బిటి రోడ్డు పనులు సాగుతున్నాయి. రెండు మూడు రోజుల్లో వడ్డిప వరకు రోడ్డు నిర్మాణం పూర్తి కావస్తుందని ఎంపిపి యర్రంశెట్టి తెలిపారు.

నత్తనడకన జల్‌జీవన్ పనులు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో గడిచిన రెండు సంవత్సరాల క్రితం మొదలుపెట్టిన జల్ జీవన్ మిషన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా సుమారు 23 కోట్లతో 25 గ్రామ పంచాయతీలకు గాను 71 పనులుగా గుర్తించి జరుగుతున్న పనులు నత్త నడకన సాగుతున్నాయి. ప్రభుత్వం నిర్మాణం చేపడు తున్న కాలనీ ఇళ్ల వద్ద అదే విధంగా కొన్ని గ్రామాల్లో గుర్తించిన చోట వాటర్ ట్యాంకులు నిర్మాణం జరుగుతున్నాయి. రాట్నాల పాలెం, రామన్నపాలెం, జి.ఎస్.ఆర్ పాలెం, నీళ్ల గుంట, బికేపల్లిలో వాటర్ ట్యాంక్ నిర్మాణాలు చేపట్టినా నేటికీ ఎక్కడ కూడా నీరు ఇచ్చిన దాఖలాలు లేవు. ప్రభుత్వం నిర్మిస్తున్న కాలనీల వద్ద వివిధ దశల్లో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే పూర్తయిన జరిగిన పైపులైను పనులు అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. పలుచోట్ల పైపులు నుండి లీకులు కావడంతో గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు. నాసిరకంగా పైపులైన్లు పనులు జరుగుతున్నాయని పలు నేతలు తెలిపిన సందర్భాలు ఉన్నాయి. నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు ఏదీ? : అయ్యన్న

ప్రజాశక్తి-గొలుగొండ: వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ కూడా తీసుకు రాలేక పోయారని మాజీ మంత్రి, నర్సీపట్నం ఎన్డీఏ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. శనివారం సాయంత్రం మండలంలోని ఏఎల్ పురం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. వైసీపీ పాలనలో దాడులు, దౌర్జన్యాలు, దోపిడిలతోనే సాగి పోయిందన్నారు. మెజార్టీ ఎంపీలను ఇస్తే ప్రత్యేక హోదా తీసుకువస్తానని ఎన్నికల ముందు చెప్పిన జగన్ తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసెత్తలేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర, మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, టీడీపీ మండల అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి రోగులకు ఉచిత ఆపరేషన్లు

కంటి ఆపరేషన్లకు రోగులను వాహనంలో తరలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- విఆర్.పురం : స్థానిక వ్యవసాయక, సాంఘిక అభివృద్ధి సంస్థ (ఎఎస్‌డిఎస్) చింతూరు ఐటిడిఎ పరిధిలోని కంటి ఆపరేషన్లు అవసరమైన 156 మందికి రవాణా వాహనం ఏర్పాటు చేయడంతో పాటు వీరికి కంటి పరీక్షలకు అవసరమైన కిట్లును రేఖపల్లి పిహెచ్‌సికి శనివారం అందించింది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ కంటి ఆపరేషన్లు చేయించుకునే వారికి ముందుగా కొన్నిరకాల టెస్ట్‌లు చేయవలసి ఉందని, ఇందు కోసం అవసరమైన కిట్లు తక్కువగా ఉన్నాయని తెలియజేయడంతో ఎఎస్‌డిఎస్ సంస్థ అధినేత గాంధీబాబు వాటిని సమకూర్చారని తెలిపారు. అలాగే ఆపరేషన్ చేయించుకొనే వారికి రవాణా ఖర్చులు కూడా సమకూర్చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ టిఎస్‌-ఎస్ సుబ్రహ్మణ్యం, ఎన్.రవి, పూజిత, సౌజన్య, జ్యోతి, ప్రసాద్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రం ప్రారంభంలో గాంధీబాబు

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దగ్గర వ్యవసాయక, సాంఘిక అభివృద్ధి సంస్థ ఏఎస్‌డిఎస్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధినేత గాంధీబాబు మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉండడంతో ప్రజలకు చల్లటి మజ్జిగ, తాగునీటిని అందించేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ టిఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, పి.మీనా, సంస్థ సిబ్బంది ఎం.రవి, పూజిత, జ్యోతి, సౌజన్య, ప్రసాద్ పాల్గొన్నారు.

దర్శకులు త్రినాథరావుకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : చలనచిత్ర దర్శకులు నక్కిన త్రినాథరావు జన్మదిన సందర్భంగా శనివారం ఆయన మిత్రులు మళ్ళ సురేంద్ర స్థానిక గవరపాలెం కరెంట్ ఆఫీస్ వద్ద దర్శకులు మేనమామ శీలా జగన్నాధరావు మాస్టర్ ఇంటిలో సాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ త్రినాథరావు ప్రస్తుతం నాలుగు సినిమాలు చేస్తున్నారన్నారు. అందులో ఒకటి చౌర్య పాఠం చిత్రం పూర్తయిందని, రెండో చిత్రం అనకాపల్లి పేరు మీద చిత్రం మొదలైందని, మూడు సందీప్ కిషన్ హీరోగా చిత్రం మొదలవుతుందని, నాలుగు దిల్ రాజ్ సారధ్యంలో నితిన్ హీరోగా చిత్రం మొదలవుతుందని తెలిపారు. ఈ చిత్రాలన్నీ విజయం సాధించాలని, అనకాపల్లికి మంచి పేరు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. దర్శకులు నక్కిన త్రినాథ్ రావు మాట్లాడుతూ ఈ సంవత్సరంలో రెండు చిత్రాలు రిలీజ్ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శీలా జగన్నాథం మాస్టర్, నక్కిన సురేష్, ఎస్. భానుచందర్ (అఖి), జొన్నాడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

డాగ్‌స్క్వాడ్‌తో కల్వర్టులు, రోడ్డు అంచుల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై తనిఖీలు ముమ్మరం చేశారు. జీకే వీధి మండలం మారుమూల గ్రామాల్లో శనివారం జీకే వీధి సిఐ అప్పలనాయుడు, ఎస్ఐ అప్పలసూరి ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వేర్ బృందాలతో కల్వర్టులు, బ్రిడ్జిలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ అప్పలనాయుడు మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేందుకు పగడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పోలీసులు పర్యటించి గిరిజనులను చైతన్యవంతులు చేస్తూ ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకోవాలని కోరామని, ఎవరైనా సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో సిఆర్పిఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

దోబీ అవతారమెత్తిన ఎమ్మెల్యే వాసుపల్లి

దోబీఘాట్‌లో బట్టలు ఉతుకుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఎన్నికల ప్రచారంలో పోటీ అభ్యర్థులు విభిన్న, వినూత్న రీతుల్లో ప్రచారం చేయడం పరిపాటి. దక్షిణ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సైతం తానేమీ తక్కువ కాదన్నట్లు దోబీ అవతారమెత్తారు. శనివారం పౌర గ్రంథాలయం ప్రక్కన గల దోబీఘాట్ వద్ద ఎన్నికల ప్రచారంలో భాగంగా బట్టలు ఉతికి ఆకట్టుకున్నారు.

నియోజకవర్గంలో ధోబిఘాట్ల అభివృద్ధికి కషి చేశానని, రజకుల సమస్యల పరిష్కారానికి పాటుపడ్డానని, వచ్చే ఎన్నికల్లో తనను దక్షిణ ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. కళా ఆసుపత్రి ఎండి డాక్టర్ పివి రమణమూర్తిని ప్రత్యేకంగా కలిసి, తన విజయానికి, వైసిపి విజయానికి తోడ్పాటు అందివ్వాలని అభ్యర్థించారు. ద్వారకానగర్, నెహ్రూబజార్ నుంచి కళా ఆసుపత్రి, శ్రీనగర్, అమర్‌నగర్ తదితర ప్రాంతాలలో ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వైసిపి ప్రభుత్వం ఏర్పాటుకు విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని, దక్షిణ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ, దక్షిణ నియోజకవర్గంలో ఫ్యాన్ గాలికి టిడిపి, బిజెపి, జనసేన కూటమి కొట్టుకుపోవడం ఖాయమని వైసిపి అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ కార్పొరేటర్ జివి రవిరాజు, వైసిపి 27వ వార్డు అధ్యక్షుడు సర్వేశ్వరరెడ్డి, చిట్టిబోయిన శివ, మద్ది శివ, రెడ్డి అజయ్, అశోక్, గురుమూర్తి, జి అప్పలరెడ్డి కనకమహాలక్ష్మి, సింహాద్రి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణింపు

- ఎపి హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి

ప్రజాశక్తి- సబ్బవరం: మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఎపి హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి అన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, భారత మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'సాంకేతికత–వ్యాపారం – ప్రజా జీవితంలో యువతుల పాత్ర' అనే అంశంపై శనివారం వర్సిటీలో నిర్వహించిన సదస్సులో వెంకట జ్యోతిర్మయి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళలు హక్కుల కోసం పోరాటం చేసిన ఎన్నో సందర్భాలు ఉన్నాయని తెలిపారు. నేడు మహిళలు వంటగది నుండి వాషింగ్‌టన్ వరకు, టీచర్ నుండి సాఫ్ట్‌వేర్ దాక, కొత్తగా వచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోనూ రాణిస్తున్నారని చెప్పారు. నేడు మహిళలు లేని రంగం లేదని, నేటి మహిళలు తమ సాధికారికత కంటే, దేశ సాధికారికత కోసం పనిచేసే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు.

విద్యార్థుల తమ లక్ష్య సాధనలో అంకిత భావంతో పని చేస్తే సాధించలేనిది ఏమి లేదని చెప్పారు. జాతీయ మహిళా కమిషన్ జాయింట్ సెక్రటరీ ఎ.అషోలి చలాయి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సామాజిక, ఆర్థిక భద్రత కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు.

వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ నేటి విద్యలోనూ, ఉపాధి రంగంలోనూ మహిళల శాతం ఎక్కువ ఉన్నదని, నేటి సమాజంలో మహిళల ప్రాముఖ్యత ఎంత ఉన్నదో చెప్పేందుకు ఇది ఒక సజీవ సాక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎయు రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్, శ్రీకాకుళం అంబేద్కర్ వర్సిటీ నుండి వి.సుజాత, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి బి.లవన కుమార్, ఫాకల్టీ కోఆర్డినేటర్, రిజిస్ట్రార్ నందిని, విమెన్ అండ్ చైల్డ్ సెంటర్ కన్వీనర్ ఆచార్య విజయ లక్ష్మి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వంద శాతం ఓటింగే లక్ష్యం

- తూర్పు నియోజకవర్గ ఆర్ఒ మయూర్ అశోక్
- యోగాసనాలతో ఓటర్లలో చైతన్యం

జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తూర్పు ఆర్ఒ మయూర్ అశోక్

ప్రజాశక్తి- విశాఖపట్నం : వందశాతం ఓటింగే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని, దీనిపై ఓటర్లలో విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత ఎన్నికల అధికారులను తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ సూచించారు. అన్ని వర్గాలనూ భాగస్వాములను చేసి, గతం కంటే ఎక్కువ పోలింగ్ శాతం నమోదయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. శనివారం ఉదయం స్వీప్ కార్యక్రమంలో అధికారులు, ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని అంశాలను ఓటర్లు తెలుసుకోవాలని, చైతన్యం కలిగి ఉండాలని హితవు పలికారు. ఓటరు హెల్ప్‌లైన్, సాక్షం, సువిధ యాప్‌ల వినియోగంపై అవగాహన పెంచుకోవ్లాన్నారు. పోటీ అభ్యర్థుల వివరాలను తెలుసుకునేందుకు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌ను అనుసరించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో అందరూ భాగస్వాములు కావాలని, ఓటర్లంతా స్వచ్ఛందంగా ఓటేసేందుకు ముందుకు వచ్చి శతశాతం పోలింగ్ లక్ష్యానికి సహకరించాలని కోరారు. అనంతరం అధికారులు, ఓటర్లతో కలిసి వుడా పార్కులో యోగాసనాలు వేసి ఓటర్లలో చైతన్యం, స్ఫూర్తి నింపే ప్రయత్నం చేశారు. తూర్పు నియోజకవర్గ ఎన్నికల అధికారులు, స్వీప్ నోడల్ అధికారులు, ఓటర్లు పాల్గొన్నారు.

పోలింగ్ రోజున దుకాణాలు, సంస్థలకు సెలవు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వచ్చేనెల 13న దుకాణాలు, సంస్థలు, కర్మాగారాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు వీలుగా సెలవు ప్రకటిస్తున్నట్లు ఎపి కార్మిక శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా ఉప కార్మిక కమిషనర్ ఎం.సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయాచోట్ల పనిచేసే వారికి తప్పకుండా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగుల వేతనంలో కోత విధించినా, సెలవు ఇవ్వకపోయినా యజమానికి జరిమానాతోపాటు శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వమిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతిఒక్కరూ విధిగా ఓటేయాలని కోరారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -అనకాపల్లి

నక్కపల్లి పోలీస్ స్టేషన్లో మహిళ పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేసిన ఉమెన్ పిసి డి.దుర్గాభవాని ఇటీవల మృతి చెందారు. భవాని తల్లి చందక రాధకు అడిషనల్ కార్పస్ ఫండ్ నుండి లక్ష రూపాయల ఆర్థిక సహాయం కింద చెక్‌ను జిల్లా ఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖ లో పని చేస్తూ మృతి చెందిన ఉమెన్ పిసి దుర్గా భవాని కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏఓ బి.శారద, జూనియర్ అసిస్టెంట్ రోజా పాల్గొన్నారు.